

# కృతి – ఆకృతి

– అపర్ణ మునుకుట్ల గునుపూడి



04

ఈ శీర్షిక ఉద్దేశ్యం కర్ణాటక సాంప్రదాయ సంస్కృతాంధ్ర కృతులలో భాష, రాగ, భావములను ప్రస్తావించి, మీకు శ్రావ్యానుభూతి కోసం ఆ కృతిని కూడా జత పరిచి మీ కందించాలని. ఈ కృతులందరికి తెలిసినవే అయినా వాటి సాహిత్య, రాగ, భావ ప్రకటనలు తెలిసేక మళ్ళీ విన్నప్పుడు ఆ కృతియొక్క ఆకృతిలో మీకు మరొక కోణం కనిపించవచ్చునేమో అన్నదే మా ఆలోచన, ఈ చిన్ని ప్రయత్నం.

గమనిక: పల్లవి, అనుపల్లవి, చరణములు ఉండి, సంగీత ప్రాధాన్యత కలిగి పెక్కు సంగతులతో రాగసంచార, భావప్రస్తారమునకు వీలుగా, స్వరకల్పనలో పాండిత్య ప్రతిభను ప్రదర్శించు విధముగా ఉన్నటువంటివి కృతులు. పల్లవి, అనుపల్లవి, పెక్కు చరణములు కలిగి ఒకే పద్ధతిలో గానము చేయగలిగి, భావ ప్రాధాన్యత కలిగినటువంటివి కీర్తనలు.

**ఈ కృతిని ఇక్కడ క్లిక్ చేసి వినవచ్చు**

గాత్రం: తనికెళ్ళ చంద్ర భాను

రచన: మైసూరు వాసుదేవాచార్యులు

రాగం: గౌళ

తాళం: ఆది తాళం

పల్లవి: ప్రణమామ్యహం శ్రీ గౌరీసుతం ఫణి తల్ప వాసుదేవ భక్త్యం సతతం

అనుపల్లవి: గణనాథం అమర బృంద సేవితం ఫణిహార భూషితం మునివర వందితం

చరణం: ధృత చారు మోదకం గజముఖం శితకరామిత గర్వ భంజకం
నత లోక సంతోషదాయకం స్రిత భక్త పాలకం సిద్ధి వినాయకం

భాద్రపదమాసంలో సుమారుగా భారతదేశం అంతటా పిల్లలు పెద్దలూ వేడుకగా జరుపుకునే విశేషమైన పండుగ వినాయక చవితి. విఘ్నేశ్వరుడిమీద కృతులు విరివిగా ఉన్నా అందులో మైసూరు వాసుదేవాచార్యులు గారు రచించిన "ప్రణమామ్యహం శ్రీ గౌరీ సుతం" ఒక ఆణి ముత్యం. కర్ణాటకలో వినాయక చవితి, గౌరీ గణేష్ పూజగా ప్రసిద్ధి. విఘ్నేశ్వరుడి మీద కృతి అయినా, వారి ప్రాంతీయతని అనుసరించి ఈ కృతి పల్లవిలో ముందుగా గౌరీ ప్రసక్తిని తీసుకువచ్చి శ్రీ గౌరి కుమారుడైన వానికి నా ప్రణామాలు అంటారు. వినాయకుడు విష్ణుమూర్తి భక్తుడు అని చెప్పే విధానంలోనే మనకి వైకుంఠంలో ఆది శేషువు మీద శయనించే విష్ణుమూర్తి సాక్షాత్కరిస్తాడు. అనుపల్లవిలో గణనాయకుడైనవాడు, సర్పములను భూషణములుగా ధరించిన వినాయకునికి అమరులు సేవిస్తూ, మునులందరూ వందనములర్పిస్తున్నారు అంటారు. చరణంలో మోదక హస్తుడు, భక్త పాలకుడు, లోక సంతోషదాయకుడైన వినాయకుడు చంద్రుడి గర్వాన్ని అణచినవాడు అని వర్ణిస్తారు.

ఈ కృతి అంతటా వినాయకుడి స్తుతి. కానీ "అమిత గర్వ భంజకం" అన్న పదం చాలా కీలకం. అతి సర్వత్ర వర్జయేత్ అంటారు. ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరికైనా అమితంగా ఏది ఉన్నా దాన్ని వదలాలి. ఇందులో ఎవరికి అమిత గర్వం? శితకరుడికి! అంటే చల్లదనాన్ని ఇచ్చేవాడు – చంద్రుడు. ప్రత్యేకంగా చంద్రుడి ప్రసంగం ఎందుకు వచ్చింది? చంద్రుడు చక్కనివాడు, చల్లనివాడు, సాక్షాత్తు లక్ష్మీదేవికి సోదరుడు, నలుగురూ అసూయపడేటటువంటి లక్షణాలన్నీ ఉన్నవాడు. అన్ని ఉన్నవాడికి తాను ఏదైనా చెయ్యవచ్చునన్న గర్వం, కాస్తంత అహంకారం అబ్బడంలో అతిశయోక్తి ఏముంది. అందునా ఒకమారు గర్వభంగం జరిగేక కూడా అతనికి గర్వం తగ్గలేదని తెలుస్తోంది. ఖగోళశాస్త్రం ప్రకారం చంద్రుడు నెలలో పదిహేను రోజులు ఎందుకు క్షీణిస్తాడో ఇప్పుడు మనకి తెలిసినా, పుక్కిటి పురాణాల్లో కథ ఇది. దక్షుడు తన ఇరవై ఏడుగురు కుమార్తెలకు తగిన వరుడని చంద్రుడికి ఇచ్చి పెళ్ళిచేస్తాడు. చంద్రుడు ఒక్క రోహిణిపై అనురాగాసక్తుడై తక్కివారందరిని విస్మరిస్తాడు. అప్పుడు వారు వెళ్లి తండ్రి దక్షుడితో మొర పెట్టుకుంటే, దక్షుడు అల్లుడనైనా చూడకుండా క్షయరోగంతో క్షీణిస్తావు అని శాపం పెడతాడు. ఆ తర్వాత ఇంటివారు గొడవ పెడితే శాపాన్ని కాస్త మార్పు చేసి నెలకి పదిహేను రోజులు మాత్రం క్షయరోగం అనుభవించేట్టు చేస్తాడు. దాంతో అతని గర్వం కాస్త అణిగినా పూర్తిగా తగలేదనిమాత్రం అందరికి తెలిసిన ఈ వినాయక చవితి కథలో తెలుస్తుంది.

ఓ చవితినాడు వినాయకుడు అందరి ప్రశంసలూ అందుకుని, వారి ప్రసాదాలన్నీ తృప్తిగా ఆరగించి, కాస్త ఆయాసపడుతూ ఇంటికి చేరేడుట. రాగానే తల్లి తండ్రి అయిన పార్వతి పరమేశ్వరులు కనిపించారు. పూర్వకాలంలో ఇల్లు వదిలి వెళ్లేప్పుడు, తిరిగి ఇంటికిరాగానే, తలి తండ్రులకి నమస్కారం చెయ్యడం కద్దు. ఆ ప్రకారం వారిని గౌరవించడం భావ్యం కనక వారికి పాద నమస్కారం చెయ్య సంకల్పించి వారి పాదాలముందు వంగేడుట. అసలే స్థూలకాయుడు, అందునా భక్తులర్పించిన మోదకాలన్నిటిని అతి తృప్తిగా ఆరగించాడాయే. దాంతో పాదాలు అందుకోలేకపోయేడు. పలుమార్లు ప్రయత్నం చేసినా సఫలీకృతుడవడు సరికదా, కిందపడిపోయి అతను తిన్నవన్నీ బయటకు వచ్చి అచేతనంగా పడిపోతాడు. ఆతని అవస్థ చూసి, తండ్రి శిరసునలకరించిన చంద్రుడు ఫక్కున నవ్వేడు. తాను అందగాడన్న గర్వం కాదా మరి. ఏదైతేనేం తన ముద్దు బిడ్డడైన వినాయకుడిని చూసి నవ్విన చంద్రుడి పై ఆగ్రహంతో నిన్ను చూసినవారు నీలాపనిందలు పొందుతారు అని శాపం పెడుతుంది. రోజూ అడక్కుండానే దర్శనమిచ్చే చంద్రుడిని చూడకుండా ఉండడం ఎలా కుదురుతుంది! దాంతో కొత్త ఇబ్బందులు మొదలవుతాయి. అప్పుడు దేవతలు మునులూ అందరు మొర పెట్టుకుంటే, బ్రహ్మ, వినాయకుడిని బ్రతికించి, పార్వతి దేవిని శాపాన్ని ఉపసంహరించమని వేడుకుంటాడు. పార్వతి దేవి శాంతించి, ఏ రోజు చంద్రుడు వినాయకుడిని చూసి నువ్వేడో అంటే చవితినాడు, ఆ రోజు మాత్రం చంద్రుని చూడకూడదు అంటుంది. ఆ తర్వాత ద్వాపర యుగంలో కృష్ణుడు ఓ చవితినాడు దురదృష్టవశాత్తు పాలల్లో చంద్రుడి ప్రతిబింబం చూడడం, దానివల్ల సత్రాజిత్తు శమంతకమణిని అపహరించాడన్న నీలాపనింద మోపడం జరుగుతుంది. ఆ సందర్భంలో కృష్ణుడు జాంబవంతుడితో ఘోరయుద్ధం చేసి శమంతకమణిని తెచ్చి ఇచ్చి తన నిర్దోషిత్వం నిరూపించుకుంటాడు. అప్పుడు మునులు మీవంటివారికే ఇంతటి అపనింద వస్తే మా గతేమిటీ? అని కోరగా కృష్ణుడు పార్వతి శాపాన్ని సవరించి, వినాయక చవితి నాడు యధావిధిగా వినాయకుడికి పూజ చేసి, ఈ కథ విన్నవాళ్ళని ఏ అపనిందలు బాధించవు అని అంటాడు. ఈ కథలు అహంకారం ఎన్ని అనర్థాలకు దారి తీస్తుందో మనకి తెలుపుతాయి. వాసుదేవాచార్యులవారు దీని భావం అంతా రెండు ముక్కల్లో వివరించి, ఈ కృతి విన్నవాళ్ళందరికీ కూడా ఆ వినాయకుడు గర్వాన్ని హరించగలడనన్న నమ్మకాన్ని కలిగిస్తారు.

హరికథలో పిట్టకథేమిటంటే వారి "లోక సంతోషదాయకం" అన్న ప్రయోగం అక్షరాలా నిజం కావడం. ఇవాళ రోజున భారత దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా "గణేశుడు! విఘ్న నివారకుడు"" అంటూ విఘ్నేశ్వరుడికి పట్టం కడుతున్నారు. దేశ దేశాల్లో ప్రజలు వినాయకుడి ప్రతిమలను విరివిగా కొని వాళ గుమ్మం ముందర, ఆఫీసు బల్లలపైని, వాహనాల్లోను పెట్టుకుంటున్నారు. విఘ్నేశ్వరుడికి ఏంతో కొంత శక్తి ఉందనడానికి అదే గొప్ప నిదర్శనం.

పది రోజుల్లో వచ్చే వినాయక చవితి నాడు పూజ చెయ్యడం కుదిరినా కుదరకపోయినా, ఈకృతి విని వినాయకుడిని, శమంతకమణి కథని తలుచుకున్నా వారందరి అహంకారాన్ని తగ్గించి, సంతోషాన్ని కలిగించి, ప్రశాంతత చేకూరుస్తుందని నమ్ముతూ.

సంగీతం ఇదం పుణ్యం సంగీతం ఇదం సౌఖ్యం
సంగీతం ఆరోగ్యప్రదం  సంగీతం శాంతియుతం

తనికెళ్ళ చంద్ర భాను కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యత పొందిన ఏ. ఐ. ఆర్ కళాకారిణి.  దుర్గాబాయి దేశ్ ముఖ్ సంగీత కళాశాలలో సంగీతాచార్యులుగా పని చేస్తున్నారు. దేశ విదేశాల్లోను, టీటీడీ, ఎస్ వి బి సి ఛానెల్ లోను విరివిగా కచేరిలు చేస్తుంటారు.  ప్రస్తుతం బెంగళూరు నివాసులు.

COMMENTS